సాక్షి బాపట్ల

శనివారం ; 6 ; జూలై ; 2024



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ నందు అమ్మపేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని నాటారు.



ఘనంగా పూర్ణాహుతి

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం పూర్ణాహుతి హోమాన్ని నిర్వహించారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో వారాహి నవరాత్రులను ప్రారంభించారు. అమ్మవారిని సర్వ లక్ష్మీ స్వరూపిణి శ్రీ శ్వేత వారాహి మహాదేవిగా లంకరించారు.

కావ్యేషు నాటకం రమ్యం

- కళలకు కాణాచి 'క్షీరపురి'
- నాటకాలకు పెరుగుతున్న ఆదరణ
- నాటకరంగానికి జీవం పోస్తున్న సాంస్కృతిక సంస్థలు

అన్ని కావ్యాల్లో నాటకం జనరంజకం కావడంతో పెద్దలు 'కావ్యేషు నాటకం రమ్యం' అని పేర్కొన్నారు. ఒక నాటిక లేదా నాటకం రక్తికట్టాలంటే కళాకారుల కృషి ఎనలేనిది. పాత్రలో పరకాయప్రవేశం చేసి జీవం పోస్తారు. ప్రేక్షకులు కొట్టే చప్పట్లే వారికి వెలకట్టలేని పారితోషికం అందుకున్నంత ఆనందం. అవి ఒకప్పటి రోజులు. అయితే, ప్రస్తుత కాలంలో నాటకాలకు ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. కళాకారులు కరువైపోతున్నారు. యువత నాటక రంగానికి దూరమై సినిమాల వైపు అడుగులు వేస్తోంది. ఈ సమయంలో అలనాటి నాటక ప్రదర్శనలకు తిరిగి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పలు కళాపరిషత్‌లు, సాంస్కృతిక సంస్థలు నడుం బిగించాయి. ఏటా నాటక, నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ కళాకారులకు ముందుకు తీసుకువస్తున్నారు. కళలకు కాణాచిగా నిలచిన క్షీరపురిలో పలు నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాయి.

చీరాల అర్బన్: ప్రజా చైతన్యానికి ఒకప్పుడు ఎంతగానో ఉపయోగపడిన నాటకాలకు సినిమా, టీవీల రాకతో ఆదరణ తగ్గింది. ఇటువంటి సమయంలో కొనఊపిరితో ఉన్న రంగస్థలానికి పలు సాంస్కృతిక సంస్థలు ఊపిరిపోస్తున్నాయి. గతంలో గ్రామాల్లో ఎక్కువగా నాటకాలు వేసేవారు. ప్రజలు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేవారు. మారుతున్న కాలంతో పాటు నాటక రంగానికి ఆదరణ తగ్గింది. చీరాల, వేటపాలెం మండలాల్లో ఎక్కువ మంది కళాకారులు ఉండేవారు. నాటక రంగంపై ఉన్న మక్కువతో పౌరాణిక, సాంఘిక నాటకాలు వేసేవారు. చీరాలలోని ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ప్రాంగణంలో ఒకప్పుడు ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉండేది. అందులోనే పలు నాటక ప్రదర్శనలు టికెట్లు పెట్టి నిర్వహించేవారు. ప్రజల నుంచి స్పందన కూడా బాగా వచ్చేది. నాటకం పూర్తయ్యే వరకు చూస్తున్న ప్రేక్షకులు ఒక్కరు కూడా వెళ్లిపోయేవారు కాదు. వారిని అంతగా మంత్రముగ్ధుల్ని చేసేవి. ఇక పండుగలు, ఉత్సవాలలో అయితే ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలలో ఒక నాటక ప్రదర్శనను తప్పనిసరిగా నిర్వహించేవారు. ఎంతో మంది కళాకారులు ఆ వేదికపై ప్రతిభను ప్రదర్శించి పాత్రలకు జీవం పోసేవారు.

సత్యహరిశ్చంద్ర నాటకంలో 'పూర్ణా సత్యం'

చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలం రామానగర్‌కు చెందిన డి.వి. సుబ్బారావు పేరొందిన కళాకారుడు. సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీను పాత్ర ఎంతో హైలెట్‌గా నిలిచేది. ఆనాడు ఆ నాటకం ప్రదర్శిస్తే ఎంతో మంది హాజరయ్యేవారు. పలువురు కళాకారులు ఆ రోజుల్లో ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చారు. చీరాలకు చెందిన పి.శివసత్యనారాయణ అనే సాంఘిక నాటక కళాకారుడు ప్రేక్షకుల నుంచి పలు ప్రశంసలు అందుకున్నారు. ప్రభుత్వం నిర్వహించే నంది నాటకోత్సవాలలో ఆయన వరుసగా మూడు బహుమతుల్ని అందుకున్నారు. పలు కళాపరిషత్‌లు నిర్వహించే నాటకాలలో వేసిన పాత్రలకు ఇప్పటి వరకు ఎన్నో బహుమతులు అందుకున్నారు. సాంఘిక నాటకాలతో పాటు పలు సినిమాలలో పాత్రలు పోషించారు. శివసత్యనారాయణ కంటే 'పూర్ణా సత్యం' గా ఆయన పేరొందారు.



చీరాలలో ప్రదర్శించిన ఓ నాటికలోని సన్నివేశం


కళలకు జీవం పోస్తున్న సాంస్కృతిక సంస్థలు

అలనాటి రంగస్థల వైభవాన్ని తిరిగి ప్రస్తుతం అందించేందుకు చీరాలలోని పలు సాంస్కృతిక సంస్థలు భుజానకెత్తుకున్నాయి. కళాంజలి, చైతన్య భారతి, నటరాజ కళాసమితి, అప్పాజోస్యులు ట్రస్ట్, వాణి కళానికేతన్ ఇలా పలు సంస్థలు సంగీత కార్యక్రమాలు, సాంఘిక, పౌరాణిక నాటకాల్ని ప్రదర్శిస్తున్నాయి. వీటిలో కళాంజలి ఆధ్వర్యంలో గత ఏడేళ్లగా ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి నాటకోత్సవాల్ని ఏటా నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని పలు కళాపరిషత్‌లు, ఆర్ట్స్ అకాడమీలు ప్రదర్శించిన నాటికల్ని ఒకే వేదికపై తీసుకువచ్చి ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. ఏటా ఐదురోజులు పాటు నాటక ప్రదర్శనలు నిర్విరామంగా నిర్వహిస్తూ, కళాకారుల ప్రతిభకు తగ్గట్టుగా పారితోషకాలను అందిస్తున్నారు. నాటికలు కూడా సమాజంలో జరిగే యథార్థ ఘటనల్ని ప్రతిబింబించేవి. ప్రజల్ని ఆలోచింపచేసే సాంఘిక నాటికలు ప్రేక్షకులకు మంత్రముగ్ధులను చేస్తున్నాయి.సమాజంలో జరిగే అంశాలనే ఇతివృత్తాలుగా తీసుకుని రచయితలు నాటకాలను రూపొందిస్తున్నారు.

ప్రేక్షకులు కొట్టే చప్పట్లే జ్ఞాపికలు

పాత్రలో ఇమిడిపోయిన పాత్రలకు జీవం పోసిన కళాకారులకు ఎంత పారితోషకం ఇచ్చినా తక్కువే. డబ్బు కన్నా ప్రేక్షకులు కొట్టే చప్పట్లు, జ్ఞాపికలే వారికి జ్ఞాపకంగా చివరి వరకు నిలిచిపోతాయి. యువత నాటక రంగానికి ఆకర్షితులైతేనే నాటకరంగం మరింత ఆదరణ పొందుతుందని సీనియర్ కళాకారులు అంటున్నారు. ఔత్సాహిక కళాకారుల్ని ప్రోత్సహించేందుకు నాటక పోటీల్ని నిర్వహిస్తేనే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొంటున్నారు.

యువత ముందుకు రావాలి



నాటక రంగం ఎంతో గొప్పది. ఆ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యువత నాటక రంగం వైపు ఆకర్షితులైతేనే అభివృద్ధి చెందుతుంది. ఒకప్పుడు గొప్ప కళాకారులు ఉండేవారు. వారితోనే ఆ కళ ముగిసిపోయింది. ప్రస్తుతం కొంతమంది మాత్రమే నాటక రంగాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.

– పి.శివసత్యనారాయణ, నటుడు , నంది అవార్డు గ్రహీత,

మంచి రచనలు నాటకానికి ప్రాణం



నాటక రంగానికి ఊపిరిపోయడానికి సాంస్కృతిక సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయం. పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాయి. ప్రస్తుతం నాటక రంగానికి ఆదరణ పెరుగుతోంది. సమాజంలో జరుగుతున్న ఘటనలపై రచించిన నాటికలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. ప్రజల్ని ఆలోచింపచేసేలా ప్రదర్శిస్తున్న నాటికలు ఎప్పటికి నిలిచిపోతాయి.

– బీరం సుందరరావు, కళాంజలి సమన్వయకర్త

న్యూస్‌రీల్

అమరేశ్వరుని సేవలో కలెక్టర్ శ్యాంప్రసాద్

అమరావతి: అమరావతిలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుణ్ణి శుక్రవారం పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తూ ఇటీవల పార్వతీపురం జిల్లా కలెక్టర్ నియమితులైన శ్యాంప్రసాద్ దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈఓ గోపీనాథశర్మ, అర్చకులు కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

31లోగా పీఎం బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: దేశంలో అసాధారణమైన ధైర్యసాహసాలు నిస్వార్థమైన సేవలు అందించిన ధైర్యవంతులైన చిన్న పిల్లలకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డుల కోసం ఈనెల 31లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇతరులకు ఆదర్శంగా ఉండేవారు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి, నూతన ఆవిష్కరణలు ప్రత్యేక నైపుణ్యం కలిగిన బాలలకు ఈ అవార్డులు ఇవ్వబడతాయన్నారు. భారత పౌరులై నివాసితులై ఉండాలని, ఐదేళ్ల నుంచి 18ఏళ్లలోపు పిల్లలు, దరఖాస్తు చేసే సమయానికి రెండేళ్లలోపు చేసిన చర్యలు, సామర్థ్యాలు, విజయాలు అర్హతలుగా పరిగణలోకి తీసుకోవటం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారుడు ఎన్ని విభాగాల్లో దరఖాస్తు చేసినా ఒక దరఖాస్తు మాత్రమే ఆమోదిస్తారన్నారు. పై అర్హతలను బట్టి ఆన్‌లైన్‌లో https://awards.gov.in వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు



నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం దేవాలయాల సముదాయంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శనివారం శ్రీవారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్(బుజ్జి) శనివారం తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెచ్చిన వారాహి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్త పూజలతో శుక్రవారం కనకదుర్గమ్మ సన్నిధిలో ఏర్పాటు చేసిన పీఠంపైకి ప్రవేశం కలిగించారు. కృష్ణానది ఒడ్డున కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రప్రథమంగా చేపట్టిన ఆషాఢ వారాహి నవరాత్రుల్లో సంప్రదాయ రీతిలో జరిపేందుకు సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాసశాస్త్రి, అచ్యుతశేఖర శర్మ వారాహి సంప్రదాయాలను వివరిస్తూ 6న ఉన్మత్త వారాహి పూజ(ఇంద్రాణిదేవి),7న బృహత్ వారాహి(బ్రహ్మీదేవి), 8న స్వప్న వారాహి పూజ (వైష్ణవీదేవి), 9న కిరాత వారాహి(మహేశ్వరి), 10న శ్వేత వారాహి(వారహి దేవి), 11న ధూమ్ర వారాహి(మహేశ్వరి), 12న మహా వారాహి(చాముండీదేవి),13న వార్తాలి వారాహి(మహాగౌరి, మహాలక్ష్మి) 14న దండిని వారాహి పూజ(లలితాదేవి), 15వ తేదీన ఆది వారాహి మహాపూజ–ఉద్యాపనతో నవ రాత్రులు ముగుస్తాయని తెలిపారు.

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన ముత్యాల బాల్‌రెడ్డి దంపతులు ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆలయ ఈవో కె.ఎస్. రామరావును కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

- విశ్రాంత పీఆర్ ఈఈపై దాడి
- చీరాల 2 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

బాపట్ల టౌన్ / చీరాల అర్బన్ : విశ్రాంత ఉద్యోగిపై దాడి ఘటనలో కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం సాయంత్రం సస్పెండ్ చేశారు. చీరాల టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. కొత్తపేటలోని టీడీపీ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగి, టీడీపీ నాయకుడు నక్కల వెంకటరమణారావుపై నియోజకవర్గానికి చెందిన కానిస్టేబుల్ బాలు యాదవ్, మరికొందరు గురువారం దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఉద్యోగం చేస్తూనే దాడులకు పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలు యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

పోస్టింగ్ చీరాల రూరల్..ఉద్యోగం బాస్ దగ్గర !

పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కానిస్టేబుల్ బాలుయాదవ్‌ను ఇటీవల జిల్లా వీఆర్ నుంచి చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ బదిలీ చేశారు.అక్కడ బాధ్యతలు నిర్వహించాల్సిన అతను ముఖ్య నేత అనుచరుడిగా వ్యవహరిస్తూ చీరాలలోనే ఉంటున్నారన్నది విశ్వసనీయ సమాచారం. ముఖ్య నేత అండతో చీరాల నియోజకవర్గంలో తనదైన శైలిలో విజృంభించారు. గురువారం విశ్రాంత పంచాయతీ రాజ్ ఈఈ నక్కల వెంకట రమణారావు ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు కొత్తపేటలోని టీడీపీ కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే నామినేటెడ్ పోస్టుల సిఫార్సు లేఖను ఆయన అందించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇంతలో కొంతమంది నాయకులతో పార్టీ కార్యాలయానికి చేరుకున్న కానిస్టేబుల్ బాలూనాయక్ తనపై ఎమ్మెల్యేకు అబద్ధాలు చెబుతావా ? అంటూ దాడి చేశారు. దీంతో బాధితుడు రమణారావు చీరాల– 2 టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

వీఆర్‌కు చీరాల డీఎస్పీ

చీరాల అర్బన్: చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ వీఆర్‌కు బదిలీ అయ్యారని సమాచారం. ఐజీ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు. చీరాల ఇన్‌చార్జి డీఎస్పీగా బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణకు అదనపు బాధ్యతలు కేటాయించారు.

సురక్షిత తాగునీరు సరఫరానే లక్ష్యం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లా ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 184 మంచినీటి చెరువుల్లో నీటిమట్టం దిగువకు చేరుతోందని తెలిపారు. కృష్ణ పశ్చిమ డెల్టా నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ట్యాంకుల నుంచి సరఫరా చేసే తాగునీటిని శుద్ధీకరించాలని ఆదేశించారు. పంచాయతీల కింద 462 నీటి పథకాలు, జిల్లా పరిషత్ కింద 31 పథకాలు, సీపీడబ్ల్యూఎస్ పథకాలు మరో 25 ఉన్నాయన్నారు. వాటితో పాటు మరో 5,083 చేతిపంపులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నీటి కాలువలలో తూటికాడ, పూడికతీత పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో రూ 7.69 కోట్లతో 45 పనులు చేయడానికి అధికారికంగా ఆమోదం లభించిందని వెల్లడించారు. ఆగస్టు 31 వరకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని చెప్పారు.



కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న వెంకట మురళి

మెరుగైన వైద్యం అందేలా చర్యలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లాలో 51 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఎనిమిది సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, 12 అర్బన్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, 477 సచివాలయాలలో వైద్య సిబ్బందితో పాటు 111 మంది వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. వీరంతా ప్రజలకు మంచి వైద్యం అందించాలని ఆయన సూచించారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకోవాలని, రైతులకు కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీలపై పర్యవేక్షణతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని తెలిపారు. తొలుత కలెక్టరేట్‌లోని కార్యాలయాల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



బాపట్ల: జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందించారు. ఇద్దరు జిల్లాలో పరిస్థితులు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాల గురించి కూలంకషంగా చర్చించారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

ఇన్‌చార్జి డీఈవో గల్లా వెంకటేశ్వర్లు

యద్దనపూడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల్ని పెంపొందిస్తూ గుణాత్మక విద్యను అందించాలని ఇన్‌చార్జి డీఈవో గల్లా వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. యద్దనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలన్నారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగున్న ప్రతిభను వెలికి తీయడమే విద్య ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా బోధన అందించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల్ని గుర్తించి వారికి ప్రత్యేక తరగతుల ద్వారా బోధన అందించాలని చెప్పారు. తమ పరిధిలో ఉన్న వనరుల్ని వినియోగించుకుంటూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత నమ్మకం పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో చిలుకూరి గోపి, ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



యద్దనపూడి పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈవో

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండేలా చర్యలు

రాష్ట్ర పరిశీలకుడు మల్లికార్జున

మార్టూరు: బడిఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలలో ఉండేలా అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని 'నేను బడికి పోతా' కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు జి. మల్లికార్జున ఆదేశించారు. మండలంలోని పలు పాఠశాలల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు కర్మాగారాలు, వ్యాపార సంస్థలు, నర్సరీలు తదితర ప్రాంతాల్ని తనిఖీ చేస్తూ బాల కార్మికుల్ని గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా కృషిచేయాలని ఆయన తెలిపారు. స్థానిక రామ్ జనార్దన్ కాలనీలోని భవిత సెంటర్‌ను సందర్శించారు. ఆయన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందించే విధానాన్ని పరిశీలించారు. స్థానిక పాఠశాల విద్యార్థులకు 'స్టూడెంట్స్ కిట్స్' పంపిణీ చేశారు. జిల్లా ఉర్దూ పాఠశాల అధికారి నజ్మా కాజుద్, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ఎం. జ్యోతి, ఎంఈవోలు వస్తం నాయక్, ప్రేమలత, సీఆర్పీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




మార్టూరులో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్న అధికారులు

పారదర్శకంగా వ్యవసాయ గణన

బాపట్ల సీపీవో జె.కె.శ్రీనివాసరావు

అద్దంకి: రెండో దశ వ్యవసాయ గణనను పారదర్శకంగా నిర్వహించాలని బాపట్ల సీపీవో జె.కె.శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ గణన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ గణనను ఆంధ్రప్రదేశ్ అర్థ గణాంక శాఖ ద్వారా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి చేపడతారని తెలిపారు. మొదటి విడతకు కొనసాగింపుగా రెండో విడత గణనను ప్రారంభించినట్లు చెప్పారు. 2021–22 రెవెన్యూ రికార్డుల ప్రకారం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. సాగు చేసిన పంటల వివరాలు, కమతపు ప్రధాన నీటి వనరు షెడ్యూలు నింపడానికి గ్రామ రెవెన్యూ అధికారులు గణకులుగా, మండల సహాయ గణాంకాధికారి పర్యవేక్షకుడిగా వ్యవహరిస్తారని చెప్పారు. గణన కోసం వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉద్యోగుల్ని కూడా నియమించుకోవచ్చని చెప్పారు. గణనను అధునిక పద్ధతిలో కంప్యూటర్‌లోని యాప్ ద్వారా చేస్తారని వివరించారు. వివిధ రైతు సంబంధిత సంక్షేమ పథకాల అమలుకు, విధాన పరమైన నిర్ణయాలు తీసుకునేందుకు, కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ గణన ఉపయోగపడుతుందని చెప్పారు. అత్యంత జాగ్రత్తగా పారదర్శకంగా నిర్వహించాలని గణకులకు సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో రజని, డీవైఎస్‌వో చీరాల అధికారి డి. చాముండేశ్వరి, అద్దంకి ఏఎస్‌వో ఆర్. రామ్‌నాథ్, సంతమాగులూరు ఏఎస్‌వో ఎస్.వి.సుబ్రహ్మణ్యం, కొరిశపాడు ఏఎస్‌వో అనూష, వీఆర్వోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

యార్డులో 29,712 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,582 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,712 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.19,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ.14,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ.19,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,289 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు కార్యదర్శి తెలిపారు.

బండ్లమ్మకు అన్నమయ్య కలెక్టర్ చామకూరి పూజలు



కలెక్టర్‌కు అమ్మవారి చిత్ర పటాన్ని అందిస్తున్న ఈవో

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయాన్ని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శుక్రవారం సందర్శించారు. బండ్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో పని చేసిన సమయంలో అనేక సార్లు అమ్మవారి దేవాలయానికి వచ్చినట్లు తెలిపారు. అద్భుతమైన శక్తిగల దేవతగా భావించి ఈ చిరుకానుక సమర్పించినట్లు చెప్పారు. దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి వేద ఆశీర్వచనం జరిపించి శాలువా,అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ కె.స్ఫూర్తి, వీర్వోలు అరుణకుమారి, నాగజ్యోతి, వీరనాయుడు ఉన్నారు.

కార్పొరేషన్ స్కూళ్లకు కోడిగుడ్ల సరఫరా

'సాక్షి' కథనంతో ప్రభుత్వంలో కదలిక

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచి గుంటూరు కార్పొరేషన్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వకపోవడంపై 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో గురువారం 'ఎగ్గొట్టారు' శీర్షికన ప్రచురించిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారమే వెలగపూడిలోని సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందిన నేపథ్యంలో గుడ్డు ఇవ్వకపోతే ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని భావించి తక్షణమే పాఠశాలలకు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి గుంటూరు కార్పొరేషన్ పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా ప్రారంభమైంది. శుక్రవారం నగరపాలకసంస్థ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని కోడిగుడ్డుతో కలిపి వడ్డించారు. ''సాక్షి'' కథనంతో విద్యార్థులకు మేలు జరిగిందని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



గుంటూరు జలగం రామారావు కార్పొరేషన్ హైస్కూల్లో విద్యార్థులకు కోడిగుడ్డుతో భోజనం

క్లుప్తంగా

క్రోసూరు పీహెచ్‌సీ వైద్యుడిగా ఎం.ఇన్నారావు

క్రోసూరు: క్రోసూరు పీహెచ్‌సీ వైద్యుడిగా డాక్టర్ ఎం.ఇన్నారావు నియమితులయ్యారు. అచ్చంపేట మండలం మాదిపాడు పీహెచ్‌సీ వైద్యుడిగా పనిచేస్తున్న వైద్యుడు డాక్టర్ ఇన్నారావును క్రోసూరు పీహెచ్‌సీకి పూర్తి స్థాయి వైద్యుడిగా(డీడీవో)గా నియమించారు. ఈ మేరకు శుక్రవారం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పీహెచ్‌సీ వైద్యురాలిగా పనిచేసిన డాక్టర్ ఎస్. బాలఅంకమ్మబాయి ఆసుపత్రి ఏఎన్ఎంలు, సిబ్బందిని వేధిస్తున్నట్లు, జీతాలు కూడా ఇవ్వకుండా అసభ్య పదాలతో దూషిస్తున్నట్లు చేసిన ఆరోపణల నేపథ్యంలో గత బుధవారం ఉన్నతాధికారులు విచారించారు. విచారణ అనంతరం ఇచ్చిన నివేదిక మేరకు జిల్లా వైద్య అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. డాక్టర్ బాలఅంకమ్మబాయిని పీపీ యూనిట్ సత్తెనపల్లికి బదిలీ చేశారు.

భక్తులకు మరిన్ని సదుపాయాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులందరికీ అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఈవో కెఎస్. రామరావు తెలిపారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులో కొండపైకి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కుళాయిలను శుక్రవారం ఈవో ప్రారంభించారు. ఘాట్‌రోడ్డు మీదగా కొండపైకి చేరుకునే భక్తులు కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వీలుగా కుళాయిలను ఏర్పాటు చేశామని చెప్పారు. లక్ష్మీ గణపతి ప్రాంగణం వద్ద క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించిన ఈవో పలు సూచనలు చేశారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2400, గరిష్ట ధర రూ.3500, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

జంతు ప్రేమికా.. జాగ్రత్త !

- జంతువుల నుంచి మనుమలకు వ్యాధులు వ్యాప్తి
- మన నుంచి వాటికి కూడా సోకే అవకాశం
- నేడు వరల్డ్ జూనోసిస్ డే



బాపట్లలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది(ఫైల్)

భట్టిప్రోలు: మూగజీవాలంటే చాలా మందికి అమితమైన ప్రేమ ఉంటుంది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు వాటితోనే గడుపుతుంటారు. అవి కూడా వారి కుటుంబంలో భాగంగా మారుతుంటాయి. అయితే, జంతువుల లాలాజలం తాకిడి, విసర్జకాల ద్వారా అనేక వ్యాధులు మనుషులకు సంక్రమిస్తాయి. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడమే వరల్డ్ జూనోసిస్ డే ప్రధాన లక్ష్యం. రేబిస్‌కి వ్యాక్సిన్ కనుగొన్న లూయిస్ పాశ్చర్ మొదటిసారి కుక్కకాటు బాధితుడికి వ్యాక్సిన్ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ జూలై 6న వరల్డ్ జూనోసిస్ డే నిర్వహిస్తున్నారు.

జూనోసిస్ అంటే....

జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే అసాధారణ ఆరోగ్య స్థితిని వైద్య పరిభాషలో జూనోసిస్ అంటారు. సంచార జీవుల నుంచి మనుషులకు అనేకం వ్యాప్తి చెందుతాయి. ఏ జంతువుల నుంచి ఏ వ్యాధులు సంక్రమిస్తాయో బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మద్దు హనుమంతరావు వివరించారు.

- ఆవులు, గేదెల నుంచి ఆంత్రాక్స్, రేబిస్, గాలికుంటు, క్షయ, తామర, మశూచి, క్యూ ఫీవర్, ఫైలేరియాసిస్ సంక్రమిస్తాయి.
- కుక్కలు, పిల్లుల నుంచి రేబిస్, కాట్ స్క్రాచ్ ఫీవర్, తామర, టాక్సోప్లాస్మోసిస్, లార్వా, మైగ్రాన్స్ వ్యాప్తి చెందుతాయి.
- ఎలుకల నుంచి ప్లేగు, లెప్టోస్పైరోసిస్ ఆశిస్తాయి.
- పందుల నుంచి మెదడువాపు, గాలికుంటు, ఇన్ఫ్లూయాంజా, బ్రూసెల్లోసిస్, లిస్టీరియోసిస్, సాల్మొనెల్లాసిస్, హైడాటిడోసిస్ వ్యాపిస్తాయి.
- గుర్రాల నుంచి ఇన్‌ఫ్లూయంజా, రేబిస్, ఆంత్రాక్స్, తామర. గ్లాండర్స్, లిష్మేనియసిస్ వ్యాప్తి చెందుతాయి.
- కోళ్లు, పక్షుల వల్ల ఇన్‌ఫ్లూయంజా, తామర, సిట్టకోసిస్, సాల్మొనెల్లాసిస్, లిస్టీరియోసిస్, క్లమిడియోసిస్ వ్యాధులు సంక్రమిస్తాయి.

అప్రమత్తత అవసరం

జూనోసిస్ రిస్క్ అధికంగా ఉన్న వర్గాల్ని వైద్యులు గుర్తించి జాగ్రత్తలు సూచిస్తున్నారు. గర్భిణులు, ఐదేళ్ల కంటే చిన్న, 65 ఏళ్ల కంటే పెద్ద వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కీమోథెరపీ బాధితులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారు ఎక్కువగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. జంతువులు కరవడం, గోళ్ల ద్వారా గాయం కావడం, వాటి తుంపర్ల ద్వారా, ఆహారాన్ని పంచుకోవడం, రోగాల బారిన పడిన జంతువుల్ని తాకడం, చర్మ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్న జంతువుల ద్వారా వ్యాధులు సంక్రమిస్తాయి.

అన్ని ఏర్పాట్లు పూర్తి



వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 17970 శునకాలకు యాంటిరేబిస్ వ్యాక్సిన్లు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జంతువుల ద్వారా అంటువ్యాధుల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. హెచ్ఐవీ సహా ఎబోలా, స్వైన్‌ఫ్లూ, రింగ్‌వార్మ్, హెపటైటిస్ ఈ, మలేరియా, ప్యారెట్ ఫీవర్, బర్డ్ ఫ్లూ, డెంగీ ఇవన్నీ జూనోసిస్ వ్యాధులే.

–మద్దు హనుమంతరావు
బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

పసుపు రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేబీ భవన్‌లో రాష్ట్ర పసుపు రైతుల కమిటీ సమావేశాన్ని శుక్రవారం వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. 2023లో ప్రధాని నరేంద్రమోదీ వాగ్దానం చేసిన మేరకు తెలంగాణాలో పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు పండించే అన్ని జిల్లాల్లో పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, జనవరి 19, 2024న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్ని ప్రమాదంలో పసుపు పంట భద్రపరుచుకుని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే క్వింటాకు రూ.12,500 చెల్లించాలని కోరారు. పసుపు పంటకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు కేశవరావు, కో కన్వీనర్ కొండా రామిరెడ్డి, కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

'యూపీఎస్సీ' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈ నెల 7వ తేదీ ఆదివారం నిర్వహించనున్న ఈపీఎఫ్‌వో-పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జి.సృజన సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరిశీలకులు అశోక్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావుతో కలిసి లైజన్ కమ్ రూట్ ఆఫీసర్లు, పరీక్ష కేంద్రాల సూపర్ వైజర్లు, సహాయ సూపర్‌వైజర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడలోని తొమ్మిది కేంద్రాల్లో ఈపీఎఫ్‌వో, 16 కేంద్రాల్లో ఈఎస్ఐసీ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్‌వో పరీక్షకు 2,401, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్‌వో-పర్సనల్ అసిస్టెంట్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్ష జరగనున్నట్లు తెలిపారు. 25 మంది లైజన్ కమ్ రూట్ అధికారులు, 25 మంది సూపర్ వైజర్లు, 25 మంది సహాయ సూపర్ వైజర్లు పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించారు.

విజయదుర్గ ఆలయంలో చండీ హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం చండీ హోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం, అమావాస్య నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించారు. తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి విశేష అలంకరణ, పూజలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. అనంతరం యాగశాలలో చండీహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో హోమం జరిపించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.


ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్ చిత్రంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ మహేష్

చేబ్రోలు: బైక్ చోరీలు చేస్తున్న ఆరుగురు అంతర్ జిల్లా దొంగల ముఠాను చేబ్రోలు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. చేబ్రోలు మండలం తోపాటు మంగళగిరి, తాడేపల్లి, నాదెండ్ల, చిలకలూరిపేట, పెదనందిపాడు, మాచవరం పోలీసు స్టేషన్ పరిధిలో వీరు మొత్తం 11 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్టు తెనాలి డీఎస్పీ ఎం.రమేష్ వివరించారు. చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రమేష్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. చేబ్రోలు మండలం నారాకోడూరులో ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లను కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. వడ్లమూడి నిషిత్ ప్రసాద్, వెలగా దీపిక, వెలగా సాయినాథ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. గుంటూరు రైలు పేట 1వ లైన్‌కు చెందిన రెడ్డి నాగభానుప్రకాష్, గుంటూరు రామిరెడ్డితోట 3వ లైన్‌కు చెందిన షేక్ ఇమ్రాన్ బాషా, గుంటూరు డొంక రోడ్డు 1వ లైన్‌కు చెందిన మునిపల్లి మధు రాజేష్, పల్నాడు జిల్లా రెంటచింతల ప్రాంతానికి చెందిన జక్కంపూడి గోపిరెడ్డి, గుంటూరు గణేష్ వీధి 3వ లైన్‌కు చెందిన పేరేచర్ల శాంతి కుమార్, గుంటూరు రామిరెడ్డితోట 4వ లైన్‌కు చెందిన షేక్ షఫీ ఈ చోరీలు చేసినట్టు గుర్తించి నారాకోడూరు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.15 లక్షల విలువ చేసే 11 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన పొన్నూరు రూరల్ సీఐ వై. కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ పి.మహేష్ కుమార్‌తోపాటు సిబ్బంది యు.శ్రీనివాసరావు, జి.నాగరాజు, పి.శివనాగరాజు, అప్పలనాయుడు, ఎస్.ధర్మరాజు మరి కొందరిని తెనాలి డీఎస్పీ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీ 'హంస' తెనాలి కొత్త కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో జిల్లా నాయకులు

తెనాలిరూరల్: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోషియేషన్ (ఏపీ హంస) సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు నాగవర్ధన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.వెంకటరెడ్డి, కార్యదర్శిగా ఆర్ఎల్ నరసింహారావు, కోశాధికారిగా శారద, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.విశ్వనాథ్, పబ్లిసిటీ సెక్రటరీగా మల్లికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగవర్ధన్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ గుర్తింపు పొందిన మొదటి యూనియన్ తమదేనని తెలిపారు.

తమిళనాడు విధానాన్నే ఆంధ్రాలోనూ అమలు చేయాలి



మోహనరావును సత్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: కంప్యూటర్‌లో పదాలను సరైన విధానంలో, వేగంగా టైప్ చేయాలంటే ప్రతి ఒక్కరికీ టైప్ రైటింగ్ తప్పనిసరని ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సి.వి. మోహన్‌రావు అన్నారు. టైప్ రైటింగ్ విధానంలో తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేసేలా రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి దృష్టికి తేవాలని కోరుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు మోహనరావుతో పాటు సెక్రటరీ ఏజీకే మూర్తి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుంచి మన రాష్ట్ర ప్రభుత్వం కంప్యూటర్ కోర్సులను ఉచితంగా నేర్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు. టైప్ రైటింగ్ నేర్చుకున్న వారే కంప్యూటర్‌లో తప్పులు లేకుండా టైప్ చేసే సామర్థ్యం పొందుతారని చెప్పారు. తమిళనాడులో 6వ తరగతి ఉత్తీర్ణులైన వారు జూనియర్ గ్రేడ్‌కు, 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు లోయర్ గ్రేడ్‌కు, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు హయ్యర్‌గ్రేడ్ పరీక్షలకు హాజరయ్యే విధంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చిందని వెల్లడించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యార్థులకు అనుమతులు మంజూరు చేయాలని వారు కోరారు. అనంతరం టైప్ రైటింగ్‌తో పాటు రేపల్లె పట్టణ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న మోహనరావును మంత్రి అనగాని సత్యప్రసాద్ శాలువాతో సత్కరించి, అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న వీవో యానిమేటర్స్

ఈపూరు: ఈపూరు గ్రామంలో వినుకొండ, శావల్యాపురం, బొల్లాపల్లి, నూజెండ్ల, ఈపూరు మండలాల్లోని వీవో యానిమేటర్స్‌కి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ వేయడం వలన భూమికి, పంటకు కలిగే ప్రయోజనాలను స్టేట్ రిసోర్స్ పర్సన్ రామచంద్రన్ వివరించారు. జిల్లా ఎస్ఎఫ్‌పీ సైదయ్య బీజామృతం ద్రవ, జీవామృతం డెమోస్ తయారు చేసి చూపించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల మొలక శాతం ఎక్కువగా వస్తుందని, భూమి నుంచి విత్తనం ద్వారా వచ్చే తెగుళ్లు నివారించవచ్చని సూచించారు. డీఎంఎంటీ ప్రకాష్ మాట్లాడుతూ భూమిలో ఘన జీవామృతం వేయడం భూమిలో కర్బన శాతం పెరుగుతుందన్నారు. అన్ని రకాల పోషకాలు అందుబాటులోకి వస్తాయని సూచించారు. ఎంటీ తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెరటి తోటలు వేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు లభించడంతో పాటు వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి శివలక్ష్మి, వేణుగోపాల్, లక్ష్మానాయక్, సీసీలు సుబ్బారావు, భాస్కరరావు, యానిమేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



క్రీడాకారిణులతో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వరరావు, పీడీలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం పల్నాడు జిల్లా జూనియర్ బాలికలు ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు. మొత్తం 30 మంది క్రీడాకారిణిలు హాజరు కాగా వారిలో ప్రతిభ చూపిన 23 మంది మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో జి.దివ్య (ఇరుకుపాలెం), ఎస్.శ్రావ్య (మాదల), ఎస్.శ్రావణి (మాదల), బి.చంద్రిక (సత్తెనపల్లి), జి.నవ్య (ఇరుకుపాలెం), కె.రోహిణి (సత్తెనపల్లి), పి.విజయలక్ష్మి(సత్తెనపల్లి), పి.అలేఖ్య (సత్తెనపల్లి), ఎస్.మౌనిక (సత్తెనపల్లి), ఎస్.మంజుల(సత్తెనపల్లి), పి.గాయత్రి(సత్తెనపల్లి), సిహెచ్ యోగి లావణ్య (మాదల), కె.త్రివేణి (మాదల), పి.ఈశ్వరి (సత్తెనపల్లి), వై.తేజస్విని (సత్తెనపల్లి), ఎస్‌కె షీమషరీన్(క్రోసూరు), పి.శ్వేత (భీమవరం), ఆర్.ప్రసన్న (సత్తెనపల్లి), ఏ.యశస్వి (ముప్పాళ్ల), ఎస్.హేమలత (బట్లూరు), ఎం.అనుగీతిక (సత్తెనపల్లి), జి.స్మైలీ(సత్తెనపల్లి), ఎస్.సంయుక్త(ధూళిపాళ్ల)లు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారిణిలు ఈనెల 7 నుంచి అనంతపూర్ ఆర్డిటి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పల్నాడు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. జట్టు ఎంపికలో పీడీలు ఎస్‌కె.రియాజ్, ఐఎస్.నాగిరెడ్డి, ఏ.శ్రీరామ్‌రెడ్డి, ఎస్ఎం సుభాని, సత్యవతి, అచ్చిరెడ్డి, నరసింహారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ ఢీకొని ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

- ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు
- మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.25వేలు అందజేత



షేక్ బాబామస్తాన్ (ఫైల్)

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ బస్సును కంటైనర్ ఢీకొని బస్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. చిలకలూరిపేట ఆర్టీసీ డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం మండలం వేమూలూరిపాడు గ్రామానికి చెందిన షేక్ బాబామస్తాన్ (54) నరసరావుపేట డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నరసరావుపేట నుంచి చీరాలకు ప్రయాణికులతో బయలుదేరాడు. చిలకలూరిపేట పట్టణంలోని బస్టాండ్ సమీపంలోకి రాగానే కంటైనర్ వాహనం ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. ప్రమాదంలో బస్సు క్యాబిన్‌నుంచి బయటకు వచ్చి పడిన డ్రైవర్‌ను కంటైనర్ వాహనం సుమారు 30 మీటర్ల మేర హైవేపై ఈడ్చుకు వెళ్లింది. దీంతో అక్కడికక్కడే డ్రైవర్ మృతి చెందగా, బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఆర్టీసీ బస్ కండక్టర్ తోట శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ ఆదాంసాహెబ్, నరసరావుపేట డీపీటీవో శ్రీనివాసరావు, డిపో మేనేజర్ బి వీరాస్వామి, గుంటూరు సీఎంఈ ఎన్ శ్రీనివాసరావు మృతి కుటుంబ సభ్యుల్ని పరామర్శించి తక్షణ సాయంగా రూ.25వేలను అందజేశారు.

అక్కడ దగ్ధమైంది ఏమిటో...!

- ఆనవాళ్లు లేకుండా కాల్చినది ఎందుకో..!!
- చెంఘీజ్‌ఖాన్‌పేటలో అనుమానాస్పదంగా సంఘటన
- కాల్చిన బూడిదలో ఎముకలు లభ్యం



అనుమానాస్పదంగా కాల్చినట్లు గుర్తించిన ప్రదేశంలో ఇదే



కొద్దిదూరంలో కనిపించిన పుర్రె

యడ్లపాడు: కొండవీడు రిజర్వు ఫారెస్టు కొండల సమీపంలో ఓ వ్యక్తిని దారుణంగా కాల్చి చంపారన్న వార్త మండలంలో కలకలం రేపింది. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని సచివాలయం వెనుకవైపు అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని శుక్రవారం పోలీసులకు గొర్రెల కాపరులు సమాచారం ఇచ్చారు. దీంతో చిలకలూరిపేట రూరల్ సీఐ పి. శ్రీనివాసరెడ్డి, యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. గ్రామ సచివాలయం వెనుక అటవీ ప్రాంతంలోని పూలలొద్ది ఆంజనేయస్వామి గుడి కొండవీడు కొండల నడుమ అనుమానాస్పదంగా కాల్చిన ఆనవాళ్లు కనిపించాయి. సుమారు 4 అడుగుల వైశాల్యంలో కాల్చిన బూడిద, అందులో బొగ్గిలిపోయిన ఎముకలు, ఘటనా స్థలికి కొద్దిదూరంలో ఓ పుర్రె ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో జిల్లా అధికారులకు సమాచారం అందించి క్లూస్ టీంను పిలిపించారు. సంఘటనా స్థలంలోని పలు ఆధారాలను క్లూస్‌టీం అధికారులు సేకరించారు. వీఆర్వోల ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా పోలీసులు నమోదు చేశారు. సీఐ పి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన గొర్రెల కాపరులు ఇచ్చిన సమాచారం మేరకు తాము శుక్రవారం సంఘటనా స్థలాన్ని చేరుకున్నామన్నారు. సంఘటనా స్థలంలో బాగా కాల్చడంతో కనీస ఆనవాళ్లను గుర్తించ లేకపోతున్నామన్నారు. దగ్ధమైన సంఘటన మాత్రం కనీసం మూడు రోజులు కిందట జరిగి ఉంటుందని భావిస్తున్నామని వివరించారు. అలాగే ఎముకలు చిన్నవిగా అందులోనూ నల్లగా మారిపోయి ఉండటంతో ఇవి మనిషివా లేక ఏదైన వన్య ప్రాణిదా అన్న విషయాన్ని తేల్చలేకపోతున్నామన్నారు. నిర్మానుష్య ప్రాంతంలో ఆ స్థాయిలో దగ్ధం చేయడానికి కారణాలు ఏమిటో తెలియాలంటే ముందుగా క్లూస్ టీం సేకరించిన ఫారెన్సిక్ ల్యాబ్ నిపుణులు ఇచ్చిన ఆధారాలతో కేసు దర్యాప్తు ముందుకు పోతుందని తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి నిర్ధారణకు రాలేమన్నారు.